సాక్షి
జనగామ

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



90 రోజుల్లో జాతర అభివృద్ధి పనులు

మేడారం జాతర పనులను 90 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. - 10లో▸



కేయూ, హార్ట్‌ఫుల్‌నెస్ ఎంఓయూ

కాకతీయ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ మధ్య సంవత్సర కాలానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉండును. రాత్రి సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహ స్వామి చక్రతీర్థం



జఫర్‌గఢ్: మండల కేంద్రంలో పడమర కొండ దిగువన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా సోమవారం మహాపూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు, శ్రీనివాసచార్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు. కాగా రాత్రి సమయంలో స్వామివారికి పుష్పయాగాన్ని నిర్వహించనున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పర్యవేక్షించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షించాలని, అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలుపై అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్ షాలోమ్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా చూడాలన్నారు. సమీక్షలో ఆర్డీఓలు గోపి రామ్, డీఎస్ వెంకన్న, డీఆర్డీఓ వసంత, అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి..

కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్స్‌తో అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సీపీఆర్ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు.

ఎలక్ట్రానిక్ కాంటాల పరిశీలన



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వానాకాలం సీజన్‌కు గానూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అందించనున్న ఎలక్ట్రానిక్ కాంటాలను స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి ఝాన్సీ సోమవారం తనిఖీ చేశారు. గోదాంలోని కాంటాలను ఒక్కొక్కటిగా 20 కిలోల బాటు తూకం వేసి చెక్ చేశారు. సరిగ్గా పనిచేయని వాటిని పక్కకు పెడుతూ సరిగ్గా ఉన్నవాటిని మార్కెట్ సిబ్బందిచే సీల్ చేయించారు.

జర్నలిజంలో నూతన పాఠ్యప్రణాళికకు ఆమోదం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలోని జర్నలిజం విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. గూగుల్‌మీట్‌లో ఆ విభాగాధిపతి డాక్టర్ ఆదిరెడ్డి అధ్యక్షతన వివిధ యూనివర్సిటీల నుంచి పలువురు ప్రొఫెసర్లు పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో బీఏ జర్నలిజం మొదటి, ద్వితీయ సంవత్సరం సెమిస్టర్లకు సంబంధించి 2025–26 విద్యాసంవత్సరానికి పాఠ్యప్రణాళికను రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్గదర్శకత్వంలో సరికొత్త సిలబస్ రూపకల్పన చేసి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమకాలీన మీడియా ధోరణులు, కమ్యూనికేషన్ టెక్నాలజీలు, జర్నలిజం రంగంలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకుని సిలబస్ రూపొందించినట్లు జర్నలిజం విభాగాధిపతి ఆర్.ఆదిరెడ్డి తెలిపారు.

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతుల ఉత్తర్వులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో 2010లో నియమితులైన 24మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంటు స్కీం (క్యాస్) పదోన్నతుల (8000 యాన్యువల్ గ్రేడ్ పే) ఉత్తర్వులను సోమవారం రిజిస్ట్రార్ వి.రామచంద్రం జారీచేశారు. త్వరలోనే వీరికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. వీరు కొంతకాలం క్రితమే దరఖాస్తు కూడా చేశారు.

ఆరుగాలం..వరదపాలు

- భారీ వర్షంతో మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం, మక్కలు
- తడిసిన ముద్దయిన వేలాది బస్తాల ధాన్యం
- వరదలోనే ధాన్యం రాశులు
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యమే కారణమంటూ ఆవేదన



మార్కెట్‌లో తడిసిన ధాన్యం రాశులు, నీటిని తోడేందుకు అష్టకష్టాలు పడుతున్న మహిళా రైతు



వరదలో మునిగిన ధాన్యాన్ని బయటకు తీసి సిమెంట్ గద్దెపై పోస్తున్న రైతు



ధాన్యం నుంచి నీటిని తోడేస్తున్న రైతులు

జనగామ: ఊహించకుండా వచ్చిన భారీ వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కల్లాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వేలాది ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. వరద నీరు మార్కెట్ ప్రాంగణంలోకి చేరి ధాన్యం చుట్టూ చేరడంతో పదుల సంఖ్యలో బస్తాలు కొట్టుకుపోయాయి. పైనుంచి వచ్చిన ప్రవాహం పెరగడంతో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వ ఐకేపీ సెంటర్లను ప్రారంభించడంలో జాప్యం చేయడంతో రైతులకు భారీగా నష్టం తప్పలేదు. మద్దతు ధర కోసం ఆశపడి నిరీక్షిస్తే మొదటికే మోసం వచ్చేలా చేసింది.

ఆగమాగం..

జిల్లాలో సోమవారం తెల్లవారుజాము కురిసిన భారీ వర్షం రైతులను కోలుకోలేకుండా చేసింది. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యం, మక్కలతో కాటన్ యార్డుతో పాటు కల్లాలు, కవర్ షెడ్‌లు పూర్తిగా నిండిపోయాయి. ప్రైవేటు కొనుగోళ్లు యథావిధిగా జరుగుతుండగా, ప్రభుత్వ సెంటర్ల ప్రారంభోత్సవంలో జాప్యం జరుగుతోంది. రైతులు తమ పంట ఉత్పత్తులకు మద్దతు ధర కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. సెంటర్లను ప్రారంభించడంలో జాప్యం చేయడంతో పాటు రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వడంలో మార్కెట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో తెల్లవారుజాము ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షంతో కాటన్ యార్డులో ఉన్న ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. వరదకు పదుల సంఖ్యలో బస్తాలు కొట్టుకుపోగా, వేలాది బస్తాలు తడిసిపోయాయి. మార్కెట్ నుంచి ఇచ్చిన టార్పాలిన్ కవర్లన్నీ చిరిగిపోయి ఉండడంతో రైతులు స్వయంగా ఇంటి నుంచి తెచ్చుకున్న కవర్లను కప్పి కాపాడుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ధాన్యం రాశుల చుట్టూ వరద నీరు చేరడంతో.. నీటిని మళ్లించేందుకు రైతులు గంటల తరబడి కష్టపడ్డారు. పెద్దఎత్తున ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నష్టం అంచనా వేయాలి..

మార్కెట్ కాటన్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యానికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 30 బస్తాలకుపైగా కొట్టుకుపోగా, 2 వేల బస్తాలకు పైగా తడిసిపోయాయి. దీంతో నష్టం అంచనా వేయాల్సి ఉంది. నీటిలో తేలియాడే పంటతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తడిసిన సరుకును ఆరబెట్టినా మళ్లీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. పంట రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు.

మార్కెట్‌లో రైతుల ధర్నా..



తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని మార్కెట్‌లో ధర్నా చేస్తున్న రైతులు

తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ రైతు సంఘం ప్రతినిధి భూక్యా చందూనాయక్ ఆధ్వర్యంలో మార్కెట్ ఎదుట ధర్నా చేపట్టారు. ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించడంలో జాప్యం చేయడంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురైందన్నారు. ధాన్యం కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, పట్టించుకోవడం లేదన్నారు. భారీ వర్షంతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి జీవన్‌కు వినతి పత్రం అందించారు.

ఆరేడు బస్తాలు కొట్టుకుపోయాయి..



ప్రభుత్వ సెంటర్ ప్రారంభిస్తారని చెబితే, 300 బస్తాల ధాన్యం తీసుకుని మార్కెట్ కాటన్ యార్డుకు ఐదు రోజుల క్రితమే వచ్చాము. నేటికీ సెంటర్ ప్రారంభం కాలేదు. అకాల వర్షంతో 60 బస్తాలకు పైగా తడిసిపోగా, ఆరేడు బస్తాలు కొట్టుకుపోయాయి.

-కూరాకుల శోభ, మహిళా రైతు, మరిగడి

వందల బస్తాలు తడిచాయి..



ఆరు రోజుల క్రితం మద్దతు ధరకు అమ్ముకునేందుకు 500 బస్తాల ధాన్యంతో మార్కెట్ కాటన్ యార్డుకు వచ్చాము. 10 బస్తాల ధాన్యం కొట్టుకుపోగా, 400బ్యాగులకు పైగా తడిసిపోయాయి. టార్పాలిన్ ఇంటి నుంచే తెచ్చుకున్నాం. మార్కెట్ సిబ్బంది ఇచ్చిన కవర్లు పనికి రావు. మళ్లీ ఆరబోసుకుంటున్నాం.

- గాజుల కట్టయ్య, రైతు, చౌడారం

ప్రభుత్వం ఆదుకోవాలి..



400 బస్తాల ధాన్యం మద్దతు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చా.. ఇందులో 300 బస్తాల వరకు తడిసిపోగా, 10 బస్తాల వరకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

-చెరుకూరి రాములు, రైతు, చౌడారం

మద్దతు ధరకే అమ్ముకోవాలి

- ధాన్యం పండించడంలో పంజాబ్‌ను మించుతున్న తెలంగాణ
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



తమ్మడపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట: వరి ధాన్యం పండించడంలో దేశంలో పంజాబ్‌ను తెలంగాణ మించుతోందని, ఆరుగాలాలు కష్టించి పనిచేసి పండించిన ధాన్యాన్ని అన్నదాతలు మద్దతు ధరకు అమ్ముకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ, మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులను రాజు చేయడమే లక్ష్యంగా గత 9 సంవత్సరాలుగా కృషి చేస్తున్నామన్నారు. గత సంవత్సరంలో విక్రయించిన సన్న ధాన్యానికి ఇంకా బోనస్ డబ్బులను ఇవ్వలేదన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఎక్కువగా అన్నదాతలు దొడ్డురకం వడ్లనే పండిస్తారని, వాటికి కూడా బోనస్‌ను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, తహసీల్దార్ రామానుజాచారి, ఏపీఎం రవి, సీఈఓ కాశ బాలస్వామి, నాయకులు పూర్ణచందర్, కొండి వెంకట్‌రెడ్డి, గంగం సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీహబ్ ప్రతినిధులతో జూమ్ మీటింగ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నుంచి వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం హైదరాబాద్‌లోని టీ హబ్ ప్రతినిధులతో జూమ్‌మీటింగ్ నిర్వహించారు. టీహబ్, కెహబ్ ఎంఓయూలో భాగంగా పొందుపర్చాల్సిన అంశాలు, ఇరు పక్షాల బాధ్యతలు, విద్యార్థులకు అందించాల్సిన నైపుణ్యాల శిక్షణలు, వాటిలో భాగస్వాములు, వారి బాధ్యతలపై చర్చించారు.

కష్టపడిన వారికే ‘డీసీసీ’

- అధ్యక్ష పదవి కోసం 30మంది దరఖాస్తు
- దరఖాస్తు చేసుకున్నవారిలో కొమ్మూరి, ఝాన్సీరెడ్డి, ఇందిర
- ‘సంఘటన్ సృజన్ అభియాన్’లో ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్, పక్కన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

జనగామ: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఐదేళ్లుగా కష్టపడి పనిచేసిన వారికే మాత్రమే డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరించామని ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్ అన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చివరిరోజు సోమవారం జనగామ మండలం పసరమడ్ల శివారు ఉషోదయ కన్వెన్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభిప్రాయ సేకరణలో టీపీసీసీ పరిశీలకులు ఎండీ అవేజ్, అరుణ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం దేబాసిస్ పట్నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో పాటు మొత్తంగా 30 మందికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర మాత్రం తనతో ఫోన్‌లో మాట్లాడడం జరిగిందన్నారు. డీసీసీ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరితో ముఖాముఖి మాట్లాడడంతో పాటు 1500 మందికి పైగా సూచనలు వినడం జరిగిందన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో స్వీకరించిన దరఖాస్తుల్లో ఆరింటిని మాత్రమే ఏఐసీసీకి పంపిస్తామన్నారు. అధినేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో కొత్త డీసీసీని ఎన్నుకుంటారన్నారు.

ప్రత్యేక సమావేశం

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న నాయకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వ్యక్తిగత అభిప్రాయాలను సేకరించారు. జిల్లా స్థాయిలో పార్టీ నిర్మాణానికి అవసరమైన నాయకత్వ ఎంపికపై పరిశీలకులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, డీసీసీగా అప్లికేషన్ చేసుకున్న వారితో పాటు నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు, ఎర్రమల్ల సుధాకర్, డాక్టర్ రాజమౌళి, ఆలేటి సిద్దిరాములు, జమాల్ షరీఫ్, ఉడుత రవి, చింతకింది మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, బడికె ఇందిర, వంగాల కళ్యాణి, చెంచారపు బుచ్చిరెడ్డి, పిన్నంటి నారాయణరెడ్డి, గుండ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రముఖ న్యాయవాది సాదిక్ అలీ, రాగళ్ల శ్రీహరి, గద్దల కిషోర్, సందేన రవీందర్, జేరిపోతుల సుధాకర్, బొట్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిలో డీపీఓ విచారణ



విచారణ చేస్తున్న డీపీఓ స్వరూప

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి గ్రామంలో అక్రమంగా ఇళ్లు నిర్మించారని సీహెచ్.లక్ష్మి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం డీపీఓ స్వరూప గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. 2021లో సర్వే నంబర్ 128లో నాలుగు ఇళ్లు అక్రమంగా నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంబంధిత బాధితులు తమ వద్ద ఆధారాలతో డీపీఓకు సమర్పించగా ఈ విషయం కోర్టు పరిధిలో ఉండడంతో పూర్తి నివేదిక అందజేయాలని కార్యదర్శి నీరజను కోరారు. విచారణలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వచ్చుడు.. ఇచ్చుడే పరిష్కారమేది?

- కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామంటూ దరఖాస్తుదారుల ఆవేదన
- ప్రజావాణిలో 38 దరఖాస్తులు స్వీకరణ
- విజ్ఞప్తులను వేగంగా పరిష్కరించాలి: కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్ షాలోమ్

జనగామ రూరల్: ఏళ్ల తరబడి సాగులో ఉండగా అక్రమంగా పట్టా చేసుకున్నారని, సదరం సర్టిఫికెట్ ఉన్న ఏళ్ల తరబడి పెన్షన్‌కు ఎదురుచూస్తున్నామని, సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు ఇప్పించాలని పలు సమస్యలతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజలు తరలివచ్చారు. వారి నుంచి అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్ షాలోమ్, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ 38 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో దరఖాస్తులు ఇస్తూ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని, సమస్యలు పరిష్కారం కావడం లేదని ఈ సందర్భంగా పలువురు వాపోయారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ..గ్రీవెన్స్‌లో ఇచ్చిన దరఖాస్తులు అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓలు గోపిరామ్, డీఎస్ వెంకన్న, డీఆర్డీఓ వసంత, గృహనిర్మాణ శాఖ పీడీ మాత్యనాయక్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు ఇలా..

- జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన ముక్క రాజయ్య తన తండ్రి పేరుతో ఉన్న భూమి సర్వే నెంబర్ 10/ 79 లోని 1.20 ఎకరం మల్ల భూమిని వారసత్వంగా పట్టా మార్పిడి చేసి ఇవ్వాలని కోరారు.
- బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన తాలిరెడ్డి మధుసూదన్‌రెడ్డి గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 202లో పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.10 ఎకరంలో భూమికి రైతుభరోసా అందుతోందని, తన భూమి లేదని, భూమికి హద్దులు చూపించి ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.
- లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన నడిగోటి సోమయ్యకు చెందిన సర్వే నెంబర్ 263 పట్టా భూమిలో 25 ఎకరాల భూమి ఉందని, 1938లో వర్షపు నీరు చెరువుకు వెళ్లేందుకు నీటిపారుదల శాఖ పంట కాల్వ నిర్మించింది. ప్రస్తుతం శివరాత్రి ఐలయ్య అనే వ్యక్తి దౌర్జన్యంగా కనీలు పాతి వర్షపు నీరు చెరువుకు వెళ్లకుండా అడ్డుకొని పంట కాల్వను పూడ్చి వేయడంతో తన భూమిలో నీరు నిలుస్తున్నదని అధికారులు తగు చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి అందజేశారు.
- బచ్చన్నపేట మండలం కేసిరెడ్డి పల్లె గ్రామం 380 సర్వే నెంబర్‌లో తాతలు, తండ్రుల నాటి నుంచి వస్తున్న 8 ఎకరాల 18 గంటల భూమి నుండి తమకు ఎటువంటి సమాచారం లేకుండా, సంతకాలు లేకుండా గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరు మీదుగా ఒక ఎకరం రెండు గుంటల భూమిని మార్పిడి చేశారని ఇమ్మడి యాకంరెడ్డి వినతిపత్రం అందించారు. ఈ మార్పిడి ఎలా జరిగిందో అడిన సమాధానం చేప్పడం లేదని విచారణ జరిపించి సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామంలో ఎక్కడ సీసీ రోడ్లు లేవని, అభివృద్ధికి దూరంగా ఉందని కత్తు రాజు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా ముక్తుంకుంట కట్ట కింద ఉన్న 500 మీటర్ల మట్టిదారి పూర్తిగా శిథిలావస్థలో ఉందని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.
- జఫర్‌గఢ్ మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్నానని, కాగా గత మే నెలలతో ఆనారోగ్యంతో నెల రోజులు లీవులో ఉన్నానని, వేతనాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని ఎం. రాజమణి వాపోయింది. 5 నెలల నుంచి వేతనాల రాక కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నామని, తమకు వేతనాలు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు వినతి అందజేశారు.

కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలి



జిల్లాలో కేంద్రీయ విద్యాలయానికి పసరవడ్లలో 5 ఎకరాల స్థలం కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర నాలుగు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయగా జిల్లాకు మాత్రం మంజూరు కాలేదు. జిల్లాలోని నిరుపేద విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి. విద్యాసంస్థలకు కావలసిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలి.

-బిర్రు ఇస్తారి, వ్యవస్థాపక అధ్యక్షుడు, నాగరత్న సేవా సంఘం

అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా సురేశ్



జనగామ రూరల్: ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జరిగే 23 సంవత్సరాల జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జనగామలోని స్కాలర్స్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు మునిగే సురేశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల డైరెక్టర్ తుమ్మ నీరజ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్ తోట మంజుల, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, కోశాధికారి అశోక్ ఆయన్ను అభినందించారు.

మెడికల్ కళాశాలలో మూడో బ్యాచ్ షురూ



ఓరియంటేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు

జనగామ: జనగామ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడో బ్యాచ్ మొదటి సంవత్సరం తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి ఆధ్వర్యంలో హెచ్ఓడీల పర్యవేక్షణలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.

97 మంది విద్యార్థులు హాజరు..

మెడికల్ కళాశాలలో 100 సీట్లకు అనుమతి లభించగా, ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ కోటాలో 97 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ ద్వారా చేరారు. ఇంకా 3 సీట్లు పెండింగ్‌లో ఉండగా, తదుపరి 3వ విడత కౌన్సెలింగ్‌లో ఆ స్థానాలు కూడా భర్తీ అయ్యే అవకాశముందని కళాశాల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం, హెచ్ఓడీలు, డాక్టర్లు గోపాల్‌రావు, మధుసూన్‌రెడ్డి, అన్వర్, విశ్వనాథ్, శంకర్, పద్మిని, శకుంతల తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

● నేటి నుంచి 18వ తేదీ వరకు అమలు

కాజీపేట రూరల్/డోర్నకల్ : డోర్నకల్–పాపటపల్లి మధ్య చేపట్టిన ఎన్ఐ (నాన్ ఇంటర్ లాకింగ్) పనుల కారణంగా ఈ నెల 14 నుంచి (మంగళవారం) 18వ తేదీ వరకు కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్ సోమవారం తెలిపారు. కొన్ని రైళ్లను రద్దు, దారి మళ్లింపు, పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్–విజయవాడ (12713/12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు (12705/12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, కాజీపేట–డోర్నకల్, డోర్నకల్–కాజీపేట (67765/67766) పుష్‌పుల్ రైళ్లను అప్ అండ్ డౌన్ రూట్‌లో రద్దు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సికింద్రాబాద్–గుంటూరు (17201/17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట–సికింద్రాబాద్ వరకే ప్రయాణించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 16, 17వ తేదీల్లో భువనేశ్వర్–ముంబాయి–భువనేశ్వర్ (11020/11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను వయా గుంటూరు మీదుగా, ఈ నెల 16,18వ తేదీన కాకినాడ–షిర్డీ, షిర్డీ–కాకినాడ (17205 /17206) షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లను వయా నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు స్టేషన్ మేనేజర్ తెలిపారు.

19న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 19వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహిళలు, పురుషుల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి తోట శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 19న ఉదయం జేఎన్ఎస్‌లోని ఖోఖో మైదానం వద్ద ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులతో కూడిన జట్లు నవంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు పెద్దపల్లిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఇతర వివరాలకు 98492 10746 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు వాయిదా

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో మూడు రోజులపాటు (13 నుంచి 15వ తేదీ వరకు) జరగాల్సిన అండర్–19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పాఠశాల క్రీడల సమాఖ్య అండర్–19 ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా క్రీడా ఎంపికలను వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి దీపావళి పండుగ అనంతరం నిర్వహిస్తామని, ఆయా తేదీలను సైతం ముందస్తుగా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ లైన్ మరమ్మతు



గార్ల: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి మెయిన్ విద్యుత్ లైన్ తీగలు తెగి నీటిలో పడ్డాయి. దీంతో సోమవారం సేరిపురం, బాలాజీతండా పంచాయతీలో విద్యుత్ సరఫరా నిలిచింది. కాగా, విద్యుత్ ఏఈ మహేంద్రబాబు ఆదేశాల మేరకు లైన్‌మెన్ సుధాకర్, కాంట్రాక్ట్ ఉద్యోగి యుగంధర్ చెరువులో ఈదుకుంటూ స్తంభం వరకు వెళ్లి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

బాలికలకు స్వీయరక్షణలో శిక్షణ

● పీఎంశ్రీ పాఠశాలల్లో అమలుకు నిధులు మంజూరు
● ఒక్కో పాఠశాలకు రూ.30వేలు
● కరాటే, కుంగ్‌ఫూ, జూడోలో ట్రైనింగ్
● త్వరలో శిక్షకుల నియామకం.. మహిళలకు ప్రాధాన్యం



విద్యారణ్యపురి: పీఎంశ్రీ పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటవుతున్నాయి. తాజాగా స్వీయ రక్షణ కోసం బాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఒక్కో పాఠశాలకు రూ.30వేలు మంజూరయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఎంపిక చేసిన పీఎంశ్రీ స్కూళ్లకు ఈ నిధులు మంజూరయ్యాయి.

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా..

పీఎంశ్రీ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఈ శిక్షణ ఉండనుంది. శిక్షణ ద్వారా బాలికలు అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. కుంగ్‌ఫూ, కరాటే, జూడో, కలరియపట్టు తదితర ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇవ్వనున్నారు. నడ్జెస్, కిక్స్‌పంచ్‌ల వంటి ప్రాథమిక శిక్షణ పద్ధతులను నేర్పిస్తారు. ప్రతీ సెషన్‌లో వార్మప్, నైపుణ్య శిక్షణ, ప్రదర్శన, కూల్‌డౌన్ భాగాలు ఉంటాయి.

అమలు విధానం..

ప్రతీ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఆధ్వర్యంలో (పర్యవేక్షణ)ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సహాయంతో ట్రైనర్లను ఎంపిక చేస్తారు. మహిళా ట్రైనర్లకు ప్రాధాన్యం ఇస్తారు. లేనిపక్షంలో పురుష ట్రైనర్లను నియమించుకోవాల్సింటుంది. బాలికలకు ఈ శిక్షణ పాఠశాల సమయంలోనే ఉంటుంది. ప్రతీ పాఠశాలలో పీఈటీ, పీడీ, ఇతర ఉపాధ్యాయుని పర్యవేక్షణలో శిక్షణ కొనసాగించాల్సి ఉంటుంది.

కాలవ్యవధి, నిధులు..

ప్రతీ పీఎంశ్రీ పాఠశాలకు రూ.30వేల చొప్పున నిధులు మంజూరు చేశారు. ట్రైనర్‌కు ప్రతీనెల రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాల్సింటుంది. మొత్తంగా 72 సెషన్‌లు నిర్వహించాలి. మూడు నెలలపాటు వారానికి 6 రోజుల శిక్షణ లేదా ఆరు నెలలపాటు వారానికి మూడు రోజుల శిక్షణ ఇవ్వాల్సింటుంది.

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ స్కూల్స్ ఇలా

జిల్లా	స్కూళ్లు
హనుమకొండ	13
వరంగల్	14
మహబూబాబాద్	21
జనగామ	15
జేఎస్ భూపాలపల్లి	07
ములుగు	08

మూల్యాంకనం.. సర్టిఫికెట్లు

బాలికలకు ఈ స్వీయ రక్షణ శిక్షణ 25 సెషన్‌ల అనంతరం ప్రాక్టికల్‌గా మూల్యాంకనం నిర్వహిస్తారు. గ్రూప్ ఏ (6, 7తరగతులు), గ్రూప్ బీ (8, 9తరగతులు)గా విభజించి ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభావంతులైన విద్యార్థులకు డిజిటల్ సర్టిఫికెట్లు (1వ, 2వ, 3వ స్థానం) అందజేస్తారు. 72 సెషన్‌ల షెడ్యూల్ మూల్యాంకన విధానం, పాఠశాలల జాబితా అనుబంధంగా జారీ చేస్తారు. ఇదిలా ఉంటే పీంఎశ్రీ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం లేదు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు



విజేతలకు పతకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్ స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన అండర్–19 బాలబాలికల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి మాట్లాడారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని చాటాలన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి వెలిశెట్టి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 మంది మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో విజేతలుగా నిలిచిన 15మంది బాలికలు, 13 మంది బాలురు ఈ నెల 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగనున్న ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, మాజీ కార్పొరేటర్ మంచాల స్వామిచరణ్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం పార్థసారథి, అండర్–19 జిల్లా కార్యదర్శి ఎస్. శ్రీధర్, భూపాలపల్లి డీవైఎస్ఓ సి.హెచ్. రఘు, పీఈటీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఎంజీఎం : కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, పీఆర్‌ఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇటీవల కేఎంసీ ప్రిన్సిపాల్, ఎంజీఎం సూపరింటెండెంట్‌లకు వినతులు అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల16 నుంచి దశల వారీగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఆస్పత్రి సిబ్బంది శోభ, సంధ్య, భానురేఖ, విక్రమ్, కోమల, రేష్మ, లావణ్య, మౌనిక, స్రవంతి, హిమబిందు,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఆర్‌జేడీ ఎ. గోపాల్
● రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతలకు అభినందన సభ



రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతలతో విద్యాశాఖ అధికారులు, అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: విద్యార్థులు మొబైల్ ఫోన్లు, మత్తు పదార్థాల వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్‌జేడీ ఎ. గోపాల్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు విద్య, క్రీడలు రెండు దోహదపడుతాయన్నారు. మూడు రోజుల పాటు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 కబడ్డీ పోటీల్లో బాలుర జట్టు విజేతగా నిలవగా, బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఖ్యాతిని నిలబెట్టిన కబడ్డీ క్రీడాకారులను అభినందించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఐఈఓ శ్రీధర్‌సుమన్, సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సత్యనారాయణ రెడ్డి, మూగల కుమార్‌యాదవ్, కొత్త కృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బరుపాటి గోపి, కోట సతీశ్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి దరిగె కుమార్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ బాధ్యుడు మర్కాల యాదిరెడ్డి, డీఎస్ఏ కోచ్‌లు జీవన్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ, హార్ట్‌ఫుల్‌నెస్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, రిజిస్ట్రార్, ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, నాస్కామ్ ప్రతినిధులు

● ధ్యానం, యోగా, నాయకత్వ లక్షణాలకు ప్రాధాన్యం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ మధ్య సంవత్సర కాలానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ మేరకు సోమవారం కేయూలోని అకడమిక్ కమిటీహాల్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ ఆదిత్య, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతోకూడిన విద్యతోపాటు వారిలో జీవన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. ధ్యానం, యోగా, పొలారిటీ టెక్నిక్స్, డిఅడిక్షన్ శిక్షణ, శాస్త్రసాంకేతికత, కమ్యూనిటీ వెల్ఫేర్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి. హనుమంతు, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ మామిడాల ఇస్తారి, కేయూ అభివృద్ధి అధికారి ఎస్.వాసుదేవరెడ్డి, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. భిక్షాలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ, నాస్కామ్ కంపెనీ ఎంఓయూ..

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీ (నాస్కామ్) సంస్థతో కాకతీయ యూనివర్సిటీ సంవత్సర కాలానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనభవనంలో నాస్కామ్ ప్రతినిధులు సతీశ్‌కుమార్, బొజ్జమ్ ప్రవీణ్‌కుమార్, కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడం, నూతన సాంకేతికతపై శిక్షణ ఇస్తామన్నారు. కేయూ మహిళాఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భిక్షాలు, ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

90 రోజుల్లో జాతర అభివృద్ధి పనులు

● అన్ని హంగులతో గద్దెల ప్రాంగణాన్ని ఆధునికీకరిస్తాం
● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, తదితరులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులను 90 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మేడారంలోని హోటల్ హరితలో మేడారం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మేడారం మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో తల్లుల గద్దెల పునరుద్ధరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. భక్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మేడారం ప్రాంతాన్ని శాశ్వతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గద్దెల ప్రాంగణ అభివృద్ధికి ప్రభుత్వం రూ.101 కోట్లు మంజూరు చేసిందని, మరో రూ.71 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జంపన్నవాగుకు ఇరువైపులా పది వేల మంది సేదదీరేందుకు షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మేడారంలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సకాలంలో పనులను పూర్తిచేయాలని సూచించారు. గతంలో జంపన్న వాగుపై వంతెన నిర్మాణం కేవలం 45 రోజుల్లో పూర్తయిందని, అదే మాదిరి ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. అంతకుముందు మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్.. అమ్మవార్ల గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులు పరిశీలించారు. కాగా, మంత్రులు పొంగులేటి, సీతక్కను పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు అమ్మవార్ల వస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఆర్డీఓ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, మేడారం ఈఓ వీరస్వామి పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ మంత్రి లేకుండానే సమీక్ష..



దేవాదాయ శాఖ మంత్రి సురేఖ లేకుండానే సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

ములుగు: మేడారం సమ్మక్క, సారక్క జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా సోమవారం మేడారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క.. అధికారులతో నిర్వహించిన సమావేశానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. సొంత శాఖకు చెందిన మంత్రి లేకుండానే సమీక్ష సమావేశం కొనసాగడం చర్చనీయాంశమైంది. 2026 జనవరి 28 నుంచి జరిగే మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. అయితే తనకు తెలియకుండానే అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారని, దేవాదాయ శాఖ పనుల్లో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పాత్ర ఏంటని మంత్రి సురేఖ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు సమాచారం. మేడారంలో జరిగిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనకు, సమీక్ష సమావేశానికి మంత్రి సురేఖ హాజరుకాకపోవడం విభేదాలకు మరింత బలాన్ని చేకూర్చాయి. కాగా, ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు రావడంతో సకాలంలో మేడారం పనులు పూర్తయ్యేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఉచ్చులో పడి దుప్పి మృత్యువాత

● విశ్వనాథపురంలో ఘటన



దుప్పి కళేబరాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ కొండల్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురంలో సోమవారం ఉచ్చులో పడి ఓ మచ్చల దుప్పి మృత్యువాత పడింది. ఎఫ్ఆర్ఓ రావుల కొండల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని నమిలిగొండ గుట్టల అటవీప్రాంతం నుంచి వచ్చిన ఓ మచ్చల దుప్పి ఆదివారం సాయంత్రం పశువులతో కలిసి తిరుగుతూ గ్రామస్తులకు కనిపించింది. ఈ క్రమంలో అడవి పందుల నుంచి తమ పంటలను రక్షించేందుకు రైతులు ఏర్పాటు చేసిన ఉచ్చు లేదా వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి ఉండొచ్చు. దీంతో వైరు మెడకు చుట్టుకుంది. అయితే ఉచ్చు నుంచి తప్పించుకుని విశ్వనాథపురం ఎస్సీ కాలనీ వరకు రాగా అక్కడ పెద్ద కట్టెకు వైరు చిక్కుకుంది. దీంతో మెడకు ఉన్న వైరు బిగుసుకోవడంతో ఊపిరాడక మృత్యువాత పడింది. దీనిపై గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి పశువైద్యులతో పోస్టుమార్టం చేయించి దుప్పి కళేబరాన్ని పూడ్చిపెట్టామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఎస్ఓ జరీనా, ఎఫ్‌బీఓ రవి తదితరులున్నారు.

అడవి పందిని ఢీకొన్న బైక్ ..

● వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు
● చికిత్స పొందుతూ మృతి



మల్లయ్య (ఫైల్)

కాళేశ్వరం: బైక్ ..అడవి పందిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహదేవపూర్ మండలం అంబటిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాటారం మండలం నస్తురుపల్లికి చెందిన పులాల మల్లయ్య(40) ఈనెల10న అంబటిపల్లికి వెళ్లాడు. తిరిగి రాత్రి తన బైక్‌పై స్వగ్రామం వస్తున్నాడు. మార్గమధ్యలో సూరారం సబ్ స్టేషన్ వద్ద అడవి పంది అడ్డొచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య పులాల ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

'మిషన్' సిమెంట్ దిమ్మెను ఢీకొని మరొకరు..

ఎస్ఎస్‌తాడ్వాయి: బైక్.. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సిమ్మెంట్ దిమ్మెను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఒడ్డుగూడెం సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని లింగాలకు చెందిన ఊకే సారయ్య(30), ఆగబోయిన మల్లయ్య బైక్‌పై ఈనెల 12న లింగాల నుంచి మేడారం వెళ్లారు. సోమవారం ఉదయం లింగాలకు బయలుదేరారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ఒడ్డుగూడెం సమీపంలో రోడ్డు పక్కన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సిమ్మెంట్ దిమ్మెను ఢీకొంది. దీంతో సారయ్య అక్కడికక్కడే మృతి చెందగా మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రిమాండ్ ఖైదీ మల్లేశ్ పోస్టుమార్టం వాయిదా

● ఎంజీఎంను సందర్శించిన జనగామ కోర్టు ఫస్ట్‌క్లాస్ సివిల్ జూనియర్ జడ్జి



మల్లేశ్ (ఫైల్)

జనగామ/దేవరుప్పుల : ఓ కేసులో రిమాండ్ ఖైదీగా జైలు శిక్ష అనుభవిస్తున్న వారాల మల్లేశ్ అనే వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. అయితే అతడి మృతిపై నిగ్గు తేల్చే ప్రత్యేక పోస్టుమార్టం సోమవారం జరగాల్సి ఉండగా ఆ ప్రక్రియ మంగళవారానికి వాయిదా పడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో గత నెల 23వ తేదీన పడకంటి బ్రహ్మచారి అనే వ్యక్తిని ఇదే గ్రామానికి చెందిన వారాల మల్లేశ్ కర్రతో కొట్టడంతో అతడి చేయి విరిగింది. ఈ విషయమై బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 8వ తేదీన మల్లయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జనగామ సబ్‌జైలుకు రిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే శనివారం జైలు మూత్రశాలకు వెళ్లిన మల్లేశ్ అక్కడ బ్లీచింగ్ పౌడర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ వరంగల్‌లో మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి కుటుంబ సభ్యులు సబ్‌జైలు ఎదుట ధర్నా చేపట్టారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ పర్యవేక్షణలో సముచిత న్యాయం చేస్తుందన్న భరోసాతో ఆందోళన విరమించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంలో భద్రపర్చారు. కాగా సోమవారం జనగామ కోర్టు ఫస్ట్‌క్లాస్ సివిల్ జూనియర్ జడ్జి శశి ఎంజీఎంను సందర్శించి తదుపరి చర్యలపై సమీక్షించారు. జైలు కస్టడీలో ఉన్న మల్లయ్య మృతిపై సమగ్ర విచారణ కోసం ఉన్నతస్థాయి వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం చేయాల్సి ఉంది. అయితే ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల సీనియర్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో కేఎంసీ ప్రొఫెసర్లు పోస్టుమార్టం చేయాలనే నిబంధనలతో మంగళవారానికి వాయిదా పడింది.

మల్లేశ్ మృతిపై అనుమానాలు..

ఓ సాధారణ కేసులో ఏకంగా రిమాండ్ కావడంతో తీవ్ర మనస్తాపం చెందడమేగాక జైలుకెళ్లిన ఆయనకు కౌన్సెలింగ్ లోపం కూడా మల్లేశ్ ఆత్మహత్యాయత్నానికి దారి తీసిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జైలుకెళ్లే క్రమంలో మానసిక ఒత్తిళ్లకు గురయ్యే నిందితులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. నిందితులు ఆత్మహత్యలకు పాల్పడే వనరులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మల్లేశ్ ప్రమాదకరం కానీ బ్లీచింగ్ పౌడర్ తాగి ఆత్మహత్యకు యత్నించారంటే నమ్మశక్యంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. ఒక వేళ తాగి అపస్మారక పరిస్థితిలోకి వెళ్లిన ఆయనను మధ్యాహ్నం 12 గంటలకు జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారని, అయితే మెరుగైన వైద్యం అందించడంతో యంత్రాంగం వైఫల్యం పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మృతుడి భార్య హైమా న్యాయ పోరాటానికి గ్రామస్తులు, ప్రజాసంఘాలు బాసటగా నిలుస్తున్న క్రమంలో అంత్యక్రియలు జరిగే వరకూ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందు చూపుతో పోలీసు యంత్రాంగం జనగామ సబ్‌జైలు, సింగరాజుపల్లిలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

'భీమునిపాదం' కనువిందు..



జాలువారుతున్న జలపాతం

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అడవిలోని భీమునిపాద జలపాతం కనువిందు చేస్తోంది. మండలంలో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి ఎత్తైన కొండలపై నుంచి వస్తున్న వర్షపు నీరు భీమునిపాద జలపాతం నుంచి ఉధృతంగా జాలువారుతోంది. దీంతో గళగళ చప్పుళ్లతో జలపాతం చూపరులను కనువిందు చేస్తోంది.